ప్రజాశక్తి

ఆదివారం 5 మార్చి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

8లో

పాఠాలు చెబుతూ..

ఆగిన గుండె

3లో



ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బలరాం

తాగునీటికి

ఇబ్బందులు రానీయొద్దు

- జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యంకు ఘన సన్మానం

5లో

గృహ నిర్మాణాలలో పురోగతి ఏదీ?: జేసీ

4లో

నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తాం

ఏవో స్వర్ణలత

ప్రజాశక్తి-టంగుటూరు


ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి జి స్వర్ణలత పేర్కొన్నారు. శనివారం మండలంలోని వల్లూరు, మర్లపాడు, కొనిజేడు గ్రామాల రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఆర్ఎన్ఆర్ 15048, బిపిటి 2270, ఎన్.ఎల్.ఆర్ 33892 రకం వరి వంగడాలను సాగు చేసి, ఈకేవైసీ చేయించుకున్న రైతుల వద్ద నుంచి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర 1530 కి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ధాన్యంలో తేమ శాతం 17, వ్యర్థ పదార్థాలు 1 శాతం, రంగు మారిన ధాన్యం 5 శాతం, ఇతర రకాల కెలీలు 6 శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. ధాన్యం విక్రయించే రైతులు ప్రభుత్వం నిర్దేశించిన సదరు ప్రమాణాలకు సిద్ధం చేసుకుని గిట్టుబాటు ధరకు విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. మండలంలోని కొనిజేడు సొసైటీ ద్వారా ధాన్యంతో పాటు జెజి 11, కాక్ 2 రకం శనగలు కూడా ప్రభుత్వ మద్దతు ధర రూ.5,335కు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు తొందరపడి మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని, స్థానిక రైతు భరోసా కేంద్రాల ద్వారా మాత్రమే విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఏఓ స్వర్ణలత రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొనిజేడు పిఏసిఎస్ కార్యదర్శి కోయా భానుమూర్తి, వల్లూరు సచివాలయం ఉద్యాన సహాయకులు లకంతోటి వనజ, వల్లూరు గ్రామ వైసిపి సీనియర్ నాయకులు కుందం హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వల్లూరులో ధాన్యం తేమ శాతాన్ని యంత్రం ద్వారా పరిశీలిస్తున్న ఏఓ స్వర్ణలత

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పంగులూరు: బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పంగులూరు ఎస్ఐ కెకె తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నో యాక్సిడెంట్ డే సందర్భంగా పంగులూరు మండల పరిధిలోని, 16వ జాతీయ రహదారిపై, గతంలో ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి, నూతనంగా డ్రమ్ములను ఏర్పాటు చేసి, రాత్రి సమయాల్లో కనిపించే విధంగా వాటిమీద రేడియం స్టిక్కర్లను అంటించినట్లు తెలియజేశారు. సరైన పత్రాలు లేని 40 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఈ చలానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగులూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



లైన్‌మన్లను సన్మానిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

విద్యుత్ లైన్‌మెన్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-బాపట్ల: అత్యవసర సమయాల్లోనూ విధులు నిర్వర్తించే విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయమని బాపట్ల పట్టణ విద్యుత్ ఏఈ పెరుగు శ్రీనివాసరావు అన్నారు. శనివారం లైన్‌మెన్ దివస్ సందర్భంగా పట్టణ విద్యుత్ సెక్షన్ లో ఉత్తమ సేవలు అందించిన లైన్‌మెన్ లను పట్టణ విద్యుత్ కార్యాలయం వద్ద శ్రీనివాసరావు సన్మానించారు. శ్రీనివాస రావు మాట్లాడుతూ పట్టణ సెక్షన్ విద్యుత్ సిబ్బంది రాత్రి సమయాల్లో తలెత్తే విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించి విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో విద్యుత్ వినియోగ దారులకు స్థానికంగా విద్యుత్ వల్ల కలిగే అంతరాయం ఏర్పడితే తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుని విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లైన్‌మన్‌లు బర్మా ప్రసాద్, సుధాకర్, ఎఎల్ఎం ఆనంద్, జెఎల్ఎంలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-రేపల్లె: జగనన్న కాలనీలో నూరుశాతం గృహ నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులను సచివాలయ సిబ్బంది చైతన్యపరచాలని తహశీల్దారు మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 18వ వార్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కొంతమంది లబ్ధిదారులు ఇప్పటికే పూర్తిచేసుకుని నివాసం ఉంటున్నారని, మరికొంత మంది లబ్ధిదారుల గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయన్నారు. మిగిలిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించుకునేలా చూడాలి. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వై పాలెం నియోజవర్గంలో 4,933 పట్టభద్రుల ఓటర్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారి తుది జాబితా ఖరారైందని తహశీల్దారు కె రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గంలో 4,933 మంది పట్టభద్రులు, 283 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. జాబితాలోని ఓటర్లకు రెవెన్యూ సిబ్బంది ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అలాగే ఆయా సచివాలయాలలో కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు వేయడానికి వచ్చే సమయంలో స్లిప్‌తో పాటు ఆధార్ కార్డుతో పోలింగ్ కేంద్రానికి రావాలని ఆయన తెలిపారు.

ఉత్తమ విద్యా బోధనతోనే సుస్థిర స్థానం

పేస్ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో మద్దిశెట్టి శ్రీధర్

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉత్తమ విద్య బోధన, నాణ్యత ప్రమాణాలతోనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో పేస్ కళాశాల ఒక సుస్థిర స్థానం సంపాదించుకున్నట్లు కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో కేవలం 240 మంది విద్యార్థులతో ఇంజనీరింగ్ కళాశాల ఇక్కడ స్థాపించామని, ప్రస్తుతం 6,500 మంది విద్యార్థులకు కళాశాల ఒక సరస్వతి నిలయంగా మారి జిల్లాలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థుల చదువు పూర్తవుతుండగానే అత్యధిక వార్షిక వేతనంతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అనేక ప్రముఖ కంపెనీలు, సంస్థలు పేస్ కళాశాల వైపు చూసేలా తమ విద్యార్థులు వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు కళాశాలలో చేసిన డ్యాన్సులు, సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ డీన్ ఆర్ వీరాంజనేయులు, ఏఓ ఎం రమణబాబు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ డీన్ కె రూప, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్

వధూవరులకు ఎమ్మెల్యే స్వామి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం అనకర్లపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అయిన అల్లూరి సుబ్బారావు కుమారుడు నరేష్ కట్టావారిపాలెం గ్రామానికి చెందిన అమ్మాయి హరిత వివాహ మహోత్సవంతో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. బత్తుల నారాయణస్వామి, వసంతరావు, రావెళ్ల రమేష్, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాదక ద్రవ్యాల వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని యర్రగొండపాలెం ఎంఈవో పి ఆంజనేయులు అన్నారు. శనివారం ఎంపిజె ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని సాధన జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో పి ఆంజనేయులు మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాల మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దని తెలిపారు. మత్తులో నేరాలు చేసి సమాజంలో నేరస్తులుగా మారవద్దని సూచించారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి చెడు దారుల్లో ఉండక సరైన మార్గంలో నడుచుకోవాలన్నారు. ఇంకా ఎంపిజె జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం, ఎంపిజె రాష్ట్ర ఫౌండర్ మెంబర్ పఠాన్ ఖాసింఖాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎంపిజె అధ్యక్షులు సయ్యద్ ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు షేక్ షేక్షావలి, కార్యదర్శి తోట రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠాలు చెబుతూ.. ఆగిన గుండె

- తరగతి గదిలోనే కుప్పకూలిన ఉపాధ్యాయుడు
- వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఘటన
- కంటతడి పెట్టుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ప్రభుత్వ ఒత్తిళ్లతో ప్రశాంతతను కోల్పోతున్న ఉపాధ్యాయులు





పాఠశాలలోనే మృతిచెందిన ఉపాధ్యాయుడు వెర్రిబాబు (ఇన్‌సెట్‌లో) వెర్రిబాబు (ఫైల్)

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులకు పాఠాలు చెబుతూ వారిని ఉన్నత భవిత వైపు అడుగులు వేయించే ఆ ఉపాధ్యాయుని గొంతు మూగబోయింది. రోజూ పాఠాలు చెప్పే ఆ గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. తమ ఉపాధ్యాయునికి ఏదో జరుగుతుందనే భయంతో పరుగులు తీసి ఇతర ఉపాధ్యాయులకు తీసుకువచ్చి చూపించేలోపే అంతా అయిపోయింది. తమ అల్లరి భరిస్తూ మంచి మాటలు చెప్పే తమ మాస్టారు ఇక లేడు అని తెలుసుకున్న ఆ చిన్నారి హృదయాలు కన్నీటితో ఆవేదన చెందారు. ఈ ఘటన వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో శనివారం జరిగింది. ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి నియోజకవర్గం జె పంగులూరు మండలం పంగులూరు గ్రామానికి చెందిన పాలపర్తి వెర్రిబాబు(45) తన ఉపాధ్యాయ వృత్తిని త్రిపురాంతకం మండలం దూపాడులో 2002లో ప్రారంభించాడు. అప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లో పనిచేస్తూ వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే శనివారం ఉదయం ఎప్పటిలాగే విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు తరగతి గదిలోకి వెళ్లిన ఉపాధ్యాయుడు వెర్రిబాబుకు గుండెపోటు రావడంతో తన కుర్చీలోనే కూర్చుండిపోయి ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన విద్యార్థులు తమ ఉపాధ్యాయుడికి ఏమి జరుగుతుందో అర్థంకాక పరుగులు తీస్తూ ఇతర ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఉపాధ్యాయులందరూ తరగతి గదికి చేరుకొని వెంటనే



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

108కి సమాచారం అందించారు. అంతలో ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ చేసిన ఎలాంటి ఫలితం కనిపించలేదు. వైద్య సిబ్బంది వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసి ఆపాటికి ఉపాధ్యాయుడు వెర్రిబాబు మతి చెందినట్లు నిర్ధారించారు. తమతో అప్పటివరకు సంతోషంగా గడిపిన ఉపాధ్యాయులు అతను మరణం చెందడంతో ఇతర ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోయారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య పాలపర్తి రాజామణి పంగులూరు మండలం కొండమూడులో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడు లక్ష్మీ సందీప్ మెడిసిన్ చదువుతుండగా కుమార్తె లక్ష్మీ సరయు టిటిసి చదువుతోంది.

- మా మాస్టారు మాకు కావాలి

తమకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు కళ్లముందే చనిపోవడం తట్టుకోలేని ఆ చిన్నారులు తమ మాస్టారు తమకు కావాలని కన్నీటి పర్యంతం అయ్యారు. తమకు ఎప్పుడూ మంచి విషయాలు చెబుతూ ఉండేవారని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు చేసేవారిని అలాంటి ఉపాధ్యాయుడు రేపటి నుంచి పాఠాలు చెప్పేందుకు రాడని తెలుసుకొని ఆ విద్యార్థులు తోటి స్నేహితులతో చెప్పుకుంటూ రోదించారు.

- ఉపాధ్యాయులపై పని ఒత్తిళ్లు

పర్యవేక్షణ పేరుతో హడావుడి చేస్తూ తనిఖీలు నిర్వహిస్తూ ఉన్నత అధికారులు ఉపాధ్యాయులపై అనేక ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. విద్యా విధానంలో ఉన్న పలుమార్పుల వలన ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనప్పటికీ మరోవైపు ఉన్నత అధికారుల ఒత్తిళ్లకు గురవుతున్నారు. అని ఈపాటికి రాష్ట్రంలో సుమారు 5 మంది ఉపాధ్యాయులు గుండెపోటుతో మరణించినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల ఒత్తిళ్లు తీసుకురాకుండా ప్రశాంత వాతావరణంలో విద్యా బోధనలు అందించే విధంగా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోలింగ్‌కు పటిష్ట చర్యలు తీసుకోవాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్ అధికారులను ఆదేశిం చారు. అలాగే గంజాయి మాదకద్రవ్యాలు వినియోగించే వారిపై, విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. శనివారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అమ్మకం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కళాశాలల్లో, హస్టళ్లలో మాదకద్రవ్యాల వలన ఆరోగ్యానికి కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. రౌడీ షీటర్స్‌ను బైండోవర్ చేయాలని, వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొ న్నారు. సున్నిత ప్రాంతాలలో పోలింగ్ సమ యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలీస్ అధికారులు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి కె నాగేశ్వరరావు(అడ్మిన్), ఎస్‌బి డిఎస్‌పి బి మరియదాసు, సబ్‌డివిజినల్ డిఎస్‌పిలు యు నాగరాజు, నారాయణస్వామి రెడ్డి, కిషోర్‌కుమార్, పల్లపురాజు, డిటిసి డిఎస్‌పి రామక్రిష్ణ, ఎఆర్ డిఎస్‌పి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్లో రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

శ్రీశైలం ఘాట్లో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘాట్లో సున్నిపెంట సమీపంలో కారు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ఉన్న దంపతులకు గాయాలు కాగా అటుగా వెళ్తున్న దోర్నాల ఎంపీపీ భర్త గుమ్మా పద్మజా యల్లేష్ వెంటనే వారిని కారులో నుంచి బయటికి దించి 108 వాహనంలో సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రివర్స్ చేయబోతే రూమ్‌లోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

విజయనగర్ కాలనీలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శనివారం కారు ప్రమాదం చోటుచేసుకుంది. రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన వ్యక్తులు పని పూర్తి చేసుకుని కారు వెనక్కు తిప్పే సమయంలో అదుపు తప్పి వెనుక స్టాంప్ రైటర్స్ రూమ్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన మహిళకు గాయాలయ్యాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో యువకుడు మృతి చెందాడు. ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలు మార్టూరు సమీపంలో చోటుచేసుకున్నాయి. బతుకుతెరువు కోసం పొరుగూరు వచ్చి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని రాజుగారిపాలెం వద్ద శనివారం చోటుచేసుకుంది. 108 యద్దనపూడి సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. నాగార్జునసాగర్‌కు చెందిన సిహెచ్ వెంకటేశ్వర్లు మండల పరిధిలోని రాజుగారిపాలెం గ్రామానికి చెందిన దాట్ల వర్మతో కలిసి గత నెలలో మార్టూరులో ఏసీ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మార్టూరు నుంచి రాజుగారి పాలెం పల్సర్ బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తూ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను



మృతిచెందిన వెంకటేశ్వర్లు

వెంకటేశ్వర్లు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న యద్దనపూడి 108 సిబ్బంది తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుని ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు. మార్టూరు పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ కమలాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో..

మార్టూరు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజుగారిపాలెం గ్రామానికి చెందిన రామకృష్ణ మార్టూరు సర్వీస్ రోడ్డులో తన బైక్‌పై వెళుతుండగా ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న యువకుడు అతి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామకృష్ణను 108 సిబ్బంది గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

డివైడర్‌ను ఢీకొని తీవ్రగాయాలు

బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కోనంకి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వేణు దంపతులు చిలకలూరిపేటలో నిత్యావసర సరుకులు తీసుకొని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మార్టూరు సమీపంలోని ఇసుకదర్శి గ్రామం వద్ద జాతీయరహదారిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వేణు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రథమ చికిత్స అందించిన 108 సిబ్బంది మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

లారీ, మినీ లారీ ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-అద్దంకి



మృతిచెందిన డ్రైవర్ రాంబాబు

లారీ మరో పార్సిల్ మినీ లారీని ఢీకొట్టిన ఘటనలో మినీ లారీ డ్రైవర్ రాంబాబు(45) అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటన మండలంలోని తిమ్మాయ పాలెం గ్రామ సమీపంలో శనివారం ఉదయం జరిగింది. విజయవాడ నుంచి దర్శికి పార్సిల్ మినీ లారీ వెళ్తున్న సమయంలో దర్శి వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న మరో లారీ కుడి పక్కన ఢీకొనడంతో పార్సిల్ లారీ డ్రైవర్ రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో అగ్నిప్రమాదం

సుమారు రూ.70 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

నగరంలోని బండ్లమిట్ట ప్రాంతంలో సికిందర్ జాస్మిన్ క్రిస్టల్ లైట్స్ ఎలక్ట్రికల్ దుకాణంలో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా భారీగా మంటల రావడంతో స్థానికులు భయాందోళనతో గురయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. సుమారు రూ.70 లక్షల విలువైన సరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దీనితో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం స్థావరంపై దాడి

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం: మండలంలోని ఛందోలు గ్రామ పరిధిలో శుక్రవారం రాత్రి భారీగా కోడి పందాలు నిర్వహించటానికి కొందరు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే విషయం ఆ నోటా ఈ నోటా స్థానిక ఎస్ఐ రాజశేకర్ దష్టికి రావటంతో ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న 14 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న నగదు 3,200 రూపాయలు, 26 ద్విచక్ర వాహనాలు, నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని చందోలు ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. కానీ గ్రామంలో ప్రజల వాదన వేరే విధంగా ఉంది. ఈ పందెం అందరికీ తెలిసే ఏర్పాట్లు చేసుకున్నారని, దీనికి సూత్రధారి ఒక ప్రముఖ శాఖకు సంబంధించిన వ్యక్తి అని, ఇతనికి స్థానికంగా ప్రతిపక్ష నాయకుని బంధువులు, రక్త సంబంధీకులు సహకరించారని గుసగుసలు వినబడుతున్నాయి. ఈ బరిలోకి వెళ్లాలంటే కనీసం 300 రూపాయలు చెల్లిస్తేనే లోపలికి పంపారని ప్రజల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. ద్విచక్ర వాహనాలు కూడా సుమారు100కు పైగా ఉంటే 26 వాహనాలపై మాత్రమే కేసు నమోదు చేయడం ఏమిటని ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు ఆపటంలో కీలకపాత్ర పోషించిన ఎస్ఐ రాజశేఖర్‌కు ప్రజలు అభినందనలు తెలువుతున్నారు. మరి ఈ కేసు విషయంలో అమాయకులు బలై అసలు నేరస్తులు తప్పించుకుంటారో లేక దోషులను పట్టుకుంటారో అని పిట్టలవానిపాలెం మండల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పొగాకు అత్యధిక ధర కిలో రూ.200

ప్రజాశక్తి-కొండపి: కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం నాడు అత్యధిక ధర కిలో రూ.200 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్ రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి ఎన్ఎన్ కండ్రిక, వర్థినేనిపాలెం, జగ్గరాజు పాలెం, అయ్యపురాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 617 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 526 బేళు కొనుగోలు చేయగా మిగిలిన 85 బేళ్లు వివిధ కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.194, సరాసరి ధర రూ.198.99 పలికిందని పేర్కొన్నారు. వేలం కేంద్రంలో 9 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలలో పురోగతి ఏదీ?

అధికారులు పనిచేయకపోతే మెమోలు జారీ చేస్తాం: జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలు జగనన్న కాలనీ లే ఔట్‌లో ఇప్పటివరకు గృహ నిర్మాణాలు పురోగతిని ఎందుకు సాధించలేదని జిల్లా జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1100 మందికి స్థలాలు ఇస్తే కేవలం 100 మంది మాత్రమే గృహాలు నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు పని చేస్తున్నారా లేదా అంటూ సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేస్తామని ఘాటుగా హెచ్చరించారు. 'నీళ్ల లేకుండా గృహ నిర్మాణం ఎలా?' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ప్రచురించబడిన కథనానికి స్పందించిన జెసి శ్రీనివాసులు భట్టిప్రోలు లేఅవుట్‌ను శనివారం పరిశీలించారు. కనీస వసతులు లేకుండా గృహాలు ఎలా నిర్మించుకోవాలని లబ్ధిదారులు జేసీ ఎదుట వాపోయారు. కనీసం నీళ్లు కూడా అందుబాటులో లేవని, డ్రమ్ము నీళ్లు వంద రూపాయల చొప్పున కొనుగోలు చేసి కట్టుబడి చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేదు. రహదారులు లేవు. వర్షాలు వస్తే మూడు అడుగుల లోతు నీళ్లు నిలబడతున్నాయని తమ గోడు వెళ్లబోసుకున్నారు. గృహాలు నిర్మిస్తే ప్రభుత్వమే మెరకలు తోలిస్తామని గత ఏడాది చెప్పటంతో బేస్‌మెంట్ వేసుకున్నామని, కాని మెరకలు మాత్రం తోలించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపు లైను ఏర్పాటుకు కాంట్రాక్టు తీసుకున్న జెడ్పిటిసి పని చేయకపోతే అధికారులు ఏమి చేస్తున్నారని జెసి ప్రశ్నించారు. రెండు రోజులలో పైపులైను పనులు పూర్తిచేసి గృహ నిర్మాణాలకు నీటి వసతి కల్పించాలని, లేకుంటే సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఇంటికి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. రహదారులు, విద్యుత్ సౌకర్యాలు త్వరలో పూర్తి చేస్తామని హామీనిచ్చారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి కె శ్రీనివాసులు

దిగువ స్థాయి అధికారులకు మెమో జారీపై చర్చ

జగనన్న కాలనీలో వసతులు కల్పనలో విఫలం చెందిన అధికారులకు మెమోలు జారీ చేస్తామని శనివారం జెసి చేసిన వ్యాఖ్యలకు మండల అధికారులు ఖంగుతిన్నారు. దీనిని సాకుగా చూపి దిగువ స్థాయి సిబ్బందికి మెమోలు జారీ చేయాలని యోచించటం సరికాదని వారు పేర్కొంటున్నారు. నీటి సమస్య పరిష్కరించాల్సిన మండల అధికారులు అందుకు కారకులైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా తమపై విరుసుకుపడితే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు.

కనీస ఏర్పాట్లు లేక ఇబ్బంది పడ్డ జాయింట్ కలెక్టర్

జాయింట్ కలెక్టర్ వస్తున్నారన్న సమాచారం ముందుగానే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు లేఅవుట్‌లో కనీస ఏర్పాట్లు చేయకపోవటం పట్ల జెసి అసహనానికి గురయ్యారు. మండుటెండలో కూర్చోవడానికి కుర్చీ, లబ్ధిదారులతో మాట్లాడటానికి టెంటు కూడా ఏర్పాటు చేయకపోవటంతో వచ్చిన పావుగంటకే జెసి వెనుదిరిగారు. తమ సమస్యలు పూర్తి స్థాయిలో చెప్పుకోవడానికి కూడా సమయం చాలలేదని అధికారుల తీరు పట్ల లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, ఎంపిడిఒ చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సర్పంచ్ దారా రవికిరణ్మయి, హౌసింగ్ ఏఈ ప్రసన్న, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సొమ్ము దోచుకునేవారిపై చర్యలు చేపట్టాలి



జగనన్న కాలనీలో గృహాలు నిర్మించకపోతే దిగువ స్థాయి అధికారులపై చర్యలు తీసుకోవడం కాదని, విడుదలైన నిధులు కాజేసే వారిపైనే చర్యలు తీసుకోవాలని కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసయోగ్యం లేని భూమిని ప్రభుత్వాన్ని మోసం చేసి లక్షల రూపాయలు కాజేసిన నాయకులపై చర్యలు ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. మండల పరిషత్ నుంచి కేటాయించిన నిధులతో పైపు లైను పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టిస్తున్న కాంట్రక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమర్ధవంతమైన సేవా భావం కలిగిన వారికి కాలనీ పనులు అప్పగించకుండా ప్రజా సొమ్మును దోచుకుతినే వారికి పనులు అప్పగించటంతోనే నేడు లబ్ధిదారులు నీళ్లను కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోవలసిన దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కాలనీ స్థలాలు కొనుగోలు గాని, జరుగుతున్న పనులపై గాని విచారించి చర్యలు చేపట్టాలని కోరారు.



పిడిఎఫ్ అభ్యర్థులకు ఓట్లను అర్థిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సంతమాగులూరు

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని, శనివారం సంతమాగులూరులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పల్నాడు జిల్లా ప్రజా సంఘాల నాయకులు, ఆయా కార్యాలయాల సిబ్బందికి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, శాసనమండలిలో ప్రజల గొంతుక వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి బాబురెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు ద్వారా ఓటర్స్‌ను అభ్యర్థించారు. ప్రభుత్వ కార్యాలయాలు అయిన ఐసిడిఎస్, వెలుగు, ఉపాధి హామీ, రెవెన్యూ, మండల పరిషత్, విద్యావనరుల కార్యాలయాలను సంప్రదించి ఓటర్లకు కరపత్రాలు అందజేసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రజా సంఘాల నాయకులు టీ పెద్దిరాజు, జి మల్లేశ్వరి, టి శ్రీనివాసరావు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు కోరుతూ ప్రచారం

ప్రజాశక్తి-మేదరమెట్ల

ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి అయిన మీగడ వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని మండలంలోని పమిడిపాడు గ్రామం పంచాయతీ బజారులో ప్రజా సంఘ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు, సిఐటియు బాధ్యులు వీరాంజనేయులు, హెల్త్ అండ్ ఇండికేటర్ కెప రాజు, కెవిపిఎస్ బాధ్యులు కంచర్ల సురేష్ పాల్గొన్నారు.



ముప్పవరం గ్రామంలో మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మొక్కజొన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని కొండమూరు, ముప్పవరం గ్రామాల్లోని మొక్కజొన్న పైరును శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంగోలు డాట్ శాస్త్రవేత్త డాక్టర్ జి రమేష్ రైతులతో మాట్లాడుతూ, 30 రోజుల మొక్కజొన్న పైరుకు 45 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ మొక్క మొదలులో వేయటం వలన, మొక్క ఎదుగుదలకు బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. కాండం తొలుచు పురుగుకు ఒక ఎకరానికి నాలుగు కిలోలు 3జి గుళికలు వేయటం వలన పురుగును నివారించవచ్చని అన్నారు. కత్తెర పురుగుకు ఒక ఎకరానికి 100 గ్రాముల ప్రోక్లిం పిచికారీ చేయటం వలన పురుగు నివారణ చేయవచ్చని అన్నారు. కలుపు సమస్య అధికంగా ఉంటే ఒక ఎకరానికి టిన్జర్ 34 మి.లీ వేయటం వలన కలుపు సమస్యను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిడిఏ ఎం విజయనిర్మల, మార్టూరు ఏడిఏ ఎం శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ దిల్ జా, జాగర్లమూడి దినేష్, రైతులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ దిశగా రేపల్లె రైల్వేస్టేషన్

ప్రజాశక్తి-రేపల్లె



రేపల్లె రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ తదితరులు

రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణలో భాగంగా గుంటూరు డివిజన్‌లో 16 రెల్వేస్టేషన్‌లను గుర్తించామని, వాటిలో రేపల్లె రైల్వేస్టేషన్ ఒకటని రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ తెలిపారు. రేపల్లె రైల్వేస్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఆధునికీకరణలో పాసింజర్‌ల సౌకర్యాలకు పెద్దపీట వేశామని పేర్కొన్నారు. అప్రోచ్‌రోడ్డు, ప్లాట్‌ఫామ్‌ల సెంటర్స్ వెడల్పు చేయటం, వేచి ఉండే గది, ఏసీ వెయిటింగ్ హాలు, మహిళలు వేచి ఉండే గది, తాగునీరు తదితర సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. బస్టాండ్‌వైపు ఉన్న రైల్వే ద్వారాన్ని సైతం అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇంకా ఆయన వెంట రైల్వే సిబ్బంది ఉన్నారు.

టీజింగ్ సమస్యపై అధైర్యపడొద్దు

ప్రజాశక్తి-బాపట్ల

టీజింగ్ వంటి సమస్యలు ఎదురైనప్పుడు విద్యార్థినులు ధైర్యంగా ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఏ ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా విద్యార్థులకు ఏ చిన్న సమస్య ఎదురైనా మానసికంగా కృంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌ను ఆశ్రయించి తక్షణరక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఛైర్‌పర్సన్ సిహెచ్ చిరంజీవి వ్యవసాయ కళాశాల ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఛైర్మన్ వి ప్రసన్న కుమారి, కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు, టి మధుమతి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామ్స్ పి సుధాకర్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సభ్యులు కె హేమ, సిహెచ్ మహాలక్ష్మి, సుజాత, వి ప్రసన్న కుమారి, బోధన, బోధనేతర మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అతిథులు

జగన్ పాలనలో లోపించిన పారదర్శకత

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

జగన్ పాలనలో పారదర్శకత పూర్తిగా లోపించిందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. మండలంలోని పుట్టావారిపాలెంలోని ఆయన తన అతిథి గృహంలో జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో మాట్లాడారు. సహజ వనరులను, ప్రజల సొమ్మును దోచుకుతినడానికే వైసిపి నాయకులు అధికారంలోకి వచ్చినట్లుందని దుయ్యబట్టారు. అభివృద్ధి మృగ్యమైన రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని పేర్కొన్నారు. జగన్ దుష్ట పాలనపై మేధావులు సంధించే తొలి అస్త్రం ఎమ్మెల్సీ ఓటే కావాలన్నారు. గాడితప్పిన వ్యవస్థలను చక్కదిద్దే శక్తి ఒక్క చంద్రబాబుకే ఉందని అన్నారు. కావున రాష్ట్ర బాగుకోసం అందరూ తెలుగుదేశం పార్టీని బలపరచాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రాజధానికి సంబంధించి ప్రజలను గందరగోళంలోకి నెట్టేలా రాష్ట్ర రాజధాని అంశాన్ని సర్కస్ ఫీట్‌గా మారుస్తోందని విమర్శించారు. మొన్నటిదాకా మూడు రాజధానులని అని ఇపుడు ఒకే రాజధాని అంటున్నారని, అది విశాఖనే అనడం తగదని అన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని అని చెప్పిన ప్రభుత్వం ఇపుడు బెంచ్ మాత్రమే అంటున్నారని విమర్శించారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాజధానుల ప్రకటన అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. పెట్టుబడుల కోసమే రాజధాని అనడం సిగ్గులేనితనమని విశాఖ నగరం ఇప్పటికే వాణిజ్య కేంద్రంగా ఉందని అన్నారు. అమరావతినే రాజధానిగా ఉండాలని, ఉంటుందని పేర్కొన్నారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గత నాలుగేళ్ల నుంచి దరిద్రమైన పాలన కొనసాగుతోందని విమర్శించారు. విశాఖలో జరుగుతున్న పారిశ్రామిక సదస్సులో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందాలను చేసుకోనున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పేర్కొన్నారని, అందులో కనీసం 10 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినా ఆనందమేనని అన్నారు. ఐటి ఎగుమతుల గురించి ఆహా ఓహో అని పాలకపక్షం చెబుతున్నప్పటికీ, అంత ఏమీ లేదని, కేవలం 150 కోట్ల ఎగుమతులు మాత్రమే జరిగాయని, పాలక పక్షం చెప్పే లెక్కలకు, వాస్తవాలకు ఎక్కడా పొంతన లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు షమీమ్ ఖాన్, బల్లికురవ సంతమాగులూరు మండలాల గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఇన్‌ఛార్జిలు, తెలుగు యువత, తెలుగు మహిళ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సెల్, ఐటీడీపీ, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కనిగిరి

మండలంలోని కంఠంవారిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని వైసీపీ మండల అధ్యక్షులు సంగు సుబ్బారెడ్డి ప్రారంభిం చారు. 200 మంది రోగులకు వైద్యనిపుణులు రామాంజనేయులు వైద్య పరీక్షలు నిర్వహించి.. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమం లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ రఘురాం పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగర పరిధిలో అక్రమ కట్టడాలు, అక్రమ లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని పలు అనధికారిక లే అవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ సిటి ప్లానర్ కె వెంకటేశ్వర్లు, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ సునీల్ ఉన్నారు.

'కృష్ణచైతన్య' కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

స్థానిక కష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ కళాశాల నందు నాలుగో సంవత్సరం చదువుతున్న ఈసీ విద్యార్థులకు వారం రోజులపాటు కెరియర్ ఆపర్చునిటీ ఇన్‌వెల్వ్ వర్క్ షాపును నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అన్న కృష్ణచైతన్య తెలిపారు ఈ వర్క్ షాప్‌ను ప్రముఖ నరేష్ టెక్నాలజీస్ గుంటూరు వారిచే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వర్క్ షాప్‌కు ఎన్‌ఐటి తాడేపల్లిగూడెంకు చెందిన రిసోర్స్ పర్సన్‌గా పిచ్చయ్య వ్యవహరించారు కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వెన్నా కష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా రంగనాయకులు, ఎంబీఏ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

- జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యంకు ఘన సన్మానం
- వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధికారులను కోరారు. స్థానిక పాత జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం జరిగింది. తాగునీటి సరఫరా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ పంపిణీపై ఈ సందర్భంగా ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఏఎస్ దినేష్ కుమార్, విజయ కష్ణన్ పాల్గొన్నారు. వేసవి పూర్తిగా రాక ముందే తమ ప్రాంతాలలో త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెలిగండ్ల, కనిగిరి, కొమరోలు, త్రిపురాంతకం, కురిచేడు, అద్దంకి జడ్పీ టి.సి.లు, కనిగిరి, హెచ్.ఎం.పాడు ఎం.పి.పి.లు సమావేశం దృష్టికి తెచ్చారు. బిల్లులు చెల్లించడం లేదంటూ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని వారు తెలిపారు. బోర్లు, ఇతర సాగునీటి పథకాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

మరమ్మతుల పనులకు ప్రాధాన్యమివ్వాలి

క్రాష్ కార్యక్రమంలో నీటి వనరుల మరమ్మతు పనులు చేపట్టడానికి ప్రాధాన్యం ఇవ్వాలని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు.





సమావేశంలో పాల్గొన్న విఠపు, కరణం బలరాం, మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

శింగరాయకొండ మండలంలోని పలు గ్రామాలలో ట్రాన్స్ఫార్మర్ల సమస్య ఉందని పి.డి.సి.సి. బ్యాంకు ఛైర్మన్ మాదాసి వెంకయ్య చెప్పారు. వైర్లు కూడా కిందకు వేలాడుతున్నాయన్నారు.

ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలి

జడ్పీటి.సి.లకు ఆయా మండలాల్లో తగిన గౌరవం లభించేలా అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించడానికి చర్యలు తీసుకుంటామని జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ: తెలిపారు. ఇంకొల్లు జడ్పీ టి.సి. మాట్లాడుతూ మండలాల్లో చేపట్టే అభివద్ధి కార్యక్రమాలకు తనకు ఆహ్వానం రావడం లేదని ఛైర్మన్ దష్టికి తెచ్చారు. ప్రజాప్రతినిధులుగా తమకు కూడా తగిన గౌరవం లభించడం లేదని కొరిశపాడు జడ్పీ టి.సి., టంగుటూరు ఎంపిపి ఛైర్‌పర్సన్ దష్టికి తీసుకువెళ్లారు. ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ స్పందిస్తూ ప్రొటోకాల్ కచ్చితంగా పాటించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యంకు ఘన సన్మానం

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యాన్ని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జడ్పీటిసిలు, ఎంపిపిలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సిఇఒ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఛైర్మన్లు, వివిధ శాఖల ధికారులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో పనిచేయాలని కోరిక

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



గిరిజన పాఠశాలలో పని చేయాలని కోరిక ఉందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలిపారు. శాసనమండలి సభ్యునిగా తనకు ఇదే చివరి జడ్పీ సమావేశమని, ఈ నెలతో తన పదవీ కాలం ముగుస్తుందన్నారు. రెండు సార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా, ఒకసారి పట్టభద్రులు ఎమ్మెల్సీగా 2007 నుంచి తాను కొనసాగుతున్నానని తెలిపారు. ప్రకాశం జిల్లాతో తనకు విడదీయలేని బంధం ఉందని, ఎమ్మెల్సీగా తనవంతు బాధ్యత నిర్వహించానని తెలిపారు. జిల్లా కోసం ఇంకా పనిచేయాలని ఉందని ఆయన భావోద్వేగానికి గురికావడంతో కళ్లు చెమ్మగిల్లాయి. ఏదైనా గిరిజన పాఠశాలలో పనిచేయాలనేది తన కోరికగా ఆయన ప్రకటించారు. వేటపాలెం గ్రంథాలయాన్ని డిజిటలైజ్ చేయాలని, జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మరింత దృష్టి పెట్టాలని అధికారులను కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ నేతల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించి శాసనమండలికి పంపిద్దామని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాలకు ఐదింటికి ఈనెల 13న ఎన్నికల జరుగుతున్నాయన్నారు. శాసనమండలి ఎన్నికల జరుగుతున్న ప్రతిసారీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పేదలు దళితుల పక్షపాతిగా వ్యవహరించే



మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

వారిని, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవారిని కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ బలపరిచి గెలిపించేందుకు కషి చేస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ధరలను విపరీతంగా పెంచుతోందని, వాటిని అరికట్టడంలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని, వీటిపై రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పొడిగించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి మరువలేనిదని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులకు ఆదరణ పెరుగుతుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నారులకు జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-దరిశి

తాళ్ళూరు మాజీ ఎంపిపి పోశం మధుసూధనరెడ్డి, అంజమ్మల కుమార్తెలు సంజన, మేఘనల ఓణీల ఫంక్షన్ శనివారం తాళ్ళూరు మండలం బెల్లంకొండవారిపాలెంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దరిశి మాజీ ఎమ్మెల్యే డాక్టరు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, అద్దంకి మాజీ ఎఎంసి ఛైర్మన్, జిల్లా వైసిపి నాయకులు వైవి భద్రారెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఎం బాషా, ఎంపిపిలు తాటికొండ శ్రీనివాసరావు, సునీత బ్రహ్మానందరెడ్డి, ఉషా మురళి, జడ్‌పిటిసి



ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

మారం వెంకటరెడ్డి, మాజీ ఎంపిపిలు కోటా రామిరెడ్డి, మోషే, ఇత్తడి దేవదానం, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-పొదిలి

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి.. మంచి ఫలితాలు సాధించాలని హబీబుల్లాబేగ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కరిముల్లాబేగ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలుసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కరిముల్లాబేగ్ మాట్లాడుతూ గతంలో పదో తరగతి పరీక్షలకు 11 పేపర్లు ఉండేవని, వాటిని 11 రోజులు రాయాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటిని ఆరు పేపర్లకు కుదించినందున ప్రతి పేపర్‌కు మూడు రోజుల ప్రణాళిక వేసుకొని రివిజన్ చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మర్రిపూడి ఎంఇఒ ఇవి రంగయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో మంచి ఫలితాలు సాధించి ఉన్నత విద్యకు మార్గం సుగమం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ తారావాణి మాట్లాడుతూ విద్యార్థులు తాము చదువుకునే సమయంలో మంచి క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెవివి జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు కోరారు. మండల కేంద్రమైన సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో శనివారం పీడిఎఫ్ అభ్యర్దులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, టి.ప్రభుదాసు, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, ఎన్.మాలతి పాల్గొన్నారు.

చట్టాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-దరిశి

విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జిఎల్‌వి సరస్వతి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మనోహరమ్మ, ఆదినారాయణ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాల్యాద్రిచౌదరి మృతి

ప్రజాశక్తి-పామూరు

మండల పరిధిలోని పుట్టపునాయుడుపల్లి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ బొల్లా మాల్యాద్రిచౌదరి(60) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని కొండపి ఎమ్మెల్యే స్వామి, మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌చార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, సిపిఎం నాయకులు సయ్యద్ హనీఫ్ సందర్శించి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో మీరావలి, మాల్యాద్రి, మస్తాన్, ఇస్మాయిల్, కంచర్ల శ్రీకాంత్, ఇరిగినేని రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

గుప్తాకు, వైసిపికి సంబంధం లేదు

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఇటీవల ఒంగోలు నగరంలో గంజాయి కేసులో పట్టుబడిన సుబ్బారావు గుప్తాకు, వైసిపికి ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుప్తా గతంలో కూడా అక్రమ మద్యం, ఇతర కేసుల్లో ఉన్నారని వివరించారు. సుబ్బారావు గుప్తా చేత ఉద్దేశపూర్వకంగానే పలువురు రాజకీయ నాయకులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మీద దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఒంగోలు కార్పొరేషన్ డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, సూపర్ బజార్ చైర్మన్ తాతా బద్రి, మాజీ చైర్మన్ తాతా ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

అదనపు న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆటోడ్రైవర్లకు ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్వీకెపి డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆటో డ్రైవర్లకు, కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజావెంకటాద్రి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ చట్టాలపై అవగాహన కల్పించేందుకు, కార్మికులకు, పేద ప్రజలకు న్యాయపరమైన అంశాలపై ఉచితంగా సేవలు అందించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఆటో నడుపుకుంటూ డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిని గుర్తించిన న్యాయమూర్తి రాజా వెంకటాద్రి అర్హత గల వారందరినీ గుర్తించి వారికి లైసెన్స్‌లు తక్షణమే ఇవ్వాలని మోటార్ వాహనాల అధికారిని ఆదేశించగా, రెండు రోజుల్లో మంజూరు చేస్తామని ఆయన అన్నారు. అనంతరం న్యాయమూర్తి ఆదినారాయణ, ఆర్టీవో అమర్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంవిఐ ఎ.మాధవరావు, పట్టణ ఎస్‌ఐ ఎ. శశికుమార్, మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంది నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అందే నాసరయ్య, ఎస్ కె.కాశిం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి

ప్రజాసంపద పరిరక్షణకు ఉద్యమించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల

ప్రజాశక్తి-దరిశి

దేశ సంపదను మోడీ ప్రభుత్వం అదానీకి దోచి పెడుతోందని, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సంపద పరిరక్షణ కోసం ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ కార్యకర్తల సమావేశం కెవి పిచ్చయ్య అధ్యక్షతన జరిగింది. సిపియం దరిశి కార్యదర్శి తాండవ రంగారావు మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలకు కోతలు పెట్టి కార్పొ రేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. వచ్చే శాసన మండలి ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, బొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నాగేశ్వరరావు, నారాయణ, కాలేబాషా, వెంకయ్య, ఎస్ కోటిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కృత్రిమ గర్భ ఉత్పత్తి లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-మద్దిపాడు

కృత్రిమ గర్భ ఉత్పత్తి లేగదూడల ప్రదర్శనను పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి శనివారం మల్లవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కత్రిమ లేగదూడల వల్ల పశు పోషకులకు అధిక లాభాలు వస్తాయన్నారు. ముందుగా మల్లవరంలోని అమూల్ జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, మండల పశు వైద్యాధికారి మాధవి, డాక్టర్ షేక్ కాలీషా, సహాయ సంచాలకులు డాక్టర్ పి.రామారావు. పశు పోషకులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న జేడీ బేబీరాణి

క్రైస్తవ సంఘాల శాంతియుత నిరసన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని కందుకూరు రోడ్‌లో ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శనివారం శింగరాయకొండ మండల స్థానిక క్రైస్తవ సంఘాలు, ఎఫ్ఎఫ్‌సిఐ, సిజిటిఐ ఆధ్వర్యంలో ఐక్య క్రైస్తవ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి పాస్టర్లు హాజరయ్యారు. 2018లో శింగరాయకొండ మండలం, ఊళ్ళపాలెం పంచాయతీలోని దేవళంపల్లిపాలెం గ్రామంలో గ్రామ బహిష్కరణ సమస్య పరిష్కారానికి బాధితుల పక్షాన ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అప్పుడు కన్నా నాగరాజు వల్లభుని గోవిందమ్మ అనే వారిపై గ్రామంలో చర్చి కట్టి ప్రార్థనలు చేస్తున్నారని అప్పట్లో గొడవలు జరిగి కేసులు కూడా నమోదయ్యాయి. అప్పటి నుంచి వీరు గ్రామంలోకి వెళ్లకుండా బయట చర్చిలోనే ఉండటంతో. ఆ కేసు అప్పటి నుంచి కోర్టులతో పాటు హెచ్ఆర్సి లో కూడా ఉండడంతో గ్రామానికి చెందిన వీళ్లంతా పాస్టర్స్ అసోసియేషన్‌ను ఆశ్రయించారు. వారి సంఘాల ఆధ్వర్యంలో ఊళ్ల పాలెం వెళ్లేందుకు సిద్ధమై వచ్చారు. అయితే పోలీసులకు సమాచారం అందజేయడంతో సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఫిరోజా ఫాతిమా, డిప్యూటీ తహసిల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అటు ఊళ్ళపాలెం లోనూ, ఇటు శింగరాయకొండలోనూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కందుకూర్ రోడ్‌లో చర్చి వద్ద సమావేశం నిర్వహించి.. గ్రామంలోని బహిష్కరణపై చర్చ నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామ బహిష్కరణ చేసిన కుటుంబానికి న్యాయం చేయాలని తీర్మానించారు. గ్రామ పెద్దలతో పాటు చర్చి పాస్టర్స్‌తో సిఐ దాచేపల్లి రంగనాథ్ సమావేశం నిర్వహించి.. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఆ కుటుంబానికి ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని వివరించారు.



నిరసన సభలో మాట్లాడుతున్న దృశ్యం

జడ్‌పిటిసికి శుభాకాంక్షలు తెలిపిన 'బూచేపల్లి'

ప్రజాశక్తి-కొండపి

స్త్రీ, శిశు సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ మరియు కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణ వెంకట్రాది రెడ్డికి జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు ఉన్నారు.



అరుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న బూచేపల్లి

గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షునిగా నాగయ్య

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సమాఖ్య (యానాది సంఘం) జిల్లా అధ్యక్షునిగా నాగులుప్పలపాడు మండలం, ఉప్పుగుండూరుకు చెందిన నంబూరి నాగయ్య ఎన్నికయ్యారు. ఈ నెల 3న బాపట్ల జిల్లా, వేటపాలెం పాలేటి నగర్‌లో రాష్ట్రస్థాయి యానాది సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గిరిజన సమాఖ్య యానాది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల ఏడుకొండలు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మేడికొండ వెంకటరమణ పాల్గొన్నారు. సమావేశంలో ఉమ్మడి ప్రకాశం బాపట్ల జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా నంబూరి నాగయ్య, బాపట్ల జిల్లా అధ్యక్షులుగా చేవూరు శంకర్‌ను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకలు ఏడుకొండలు వారికి నియామక పత్రాలను అందజేశారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన నంబూరి నాగయ్యను గిరిజన సమాఖ్య నాయకులు అభినందించారు.

ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కంభం రూరల్

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మార్కాపురం డివైఈవో ఎ.చంద్రమౌళీశ్వర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, సౌకర్యాలను, పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ట్యాబుల వినియోగం, జగనన్న గోరుముద్ద మెనూ, విద్యా కానుకల వినియోగం తదితర అంశాలను పరిశీలించి.. సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఈవో చంద్రమౌళీశ్వర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖాధికారి బి.మాల్యాద్రి, పాఠశాల ఉపాధ్యాయ బందం మర్యాదపూర్వకంగా సన్మానించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంంలోని పడమటిపల్లిలోని శ్రీ అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని పిసి.పల్లి ఉన్నత పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు శనివారం శుభ్రం చేసి.. పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం చేసిన త్యాగాన్ని పాఠశాల ఎన్‌సిసి అధికారి జివి.మాల్యాద్రి విద్యార్థులకు వివరించారు. పొట్టిశ్రీరాములు పూర్వీకులు నివసించిన గృహాన్ని సందర్శించారు.

గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఒంగోలు పట్టణంలోని ఫేస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఈ నెల మూడో తేదీన నిర్వహించిన సజన-2023 పోటీల్లో స్థానిక గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్‌అలీబేగ్ తెలిపారు ఈ సందర్భంగా శనివారం సాయంత్రం కళాశాల ఆవరణలో విద్యార్ధలకు అభినంధన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ మీర్జా షంషీర్ అలీ బేగ్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విభాగంలో బిటెక్ నాలుగో సంవత్సరం సిఎస్సి బ్రాంచ్‌కి చెందిన ఎస్ శృతి, ఎమ్ గౌతమి ప్రథమ బహుమతిని సాధించడం జరిగిందన్నారు. బీటెక్ మూడవ సంవత్సరం సివిల్ విభాగానికి చెందిన ఎం జ్యోతి, షహీన్ అనే ఇద్దరు విద్యార్థలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో ఖాసింబి, నాగ ప్రవీణ్ కుమార్ ప్రథమ బహుమతిని సాధించారని పేపర్ ప్రజెంటేషన్ విభాగంలో తరుణ్ మెకానికల్ బ్రాంచ్ కి చెందిన విద్యార్థి ప్రథమ బహుమతిని సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకోనిరావవటం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.

అధ్వానంగా రహదారి

- బండివారిపాలెం, లక్ష్మీపురం గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని బండివారిపాలెం గ్రామం నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు ఎనిమిది కిలోమీటర్లు నిడివి ఉన్న ఆర్అండ్బి రహదారి శిథిలావస్థకు చేరింది. అస్తవ్యస్తంగా తయారై అడుగడుగునా గుంతలమయంగా మారింది. ఈ రహదారి అద్దంకి నుంచి బల్లికురవ మీదుగా కొప్పరం, బండివారిపాలెం, మిన్నేకల్లు గ్రామాన్ని కలుపుతూ లక్ష్మీపురం వద్ద గుంటూరు, కర్నూలు రహదారిలో కలుస్తుంది. ఈ రహదారి గుండా బల్లికురవ, కొప్పరపాలెం, కొప్పరం, బండివారిపాలెం ప్రాంతాల వారు సంతమాగులూరు వైపు



గుంతలమయంగా ఉన్న రహదారి

వెళ్లకుండా, మిన్నేకల్లు మీదుగా నరసరావుపేట, చిలకలూరిపేట, కోటప్పకొండ వైపు నిత్యం బేల్దారి పనులకు కార్మికులు మోటార్ సైకిళ్లు, ఆటోల ద్వారా వెళుతుంటారు. రాత్రులందు ఈ రహదారిపై వాహనాలలో ప్రయాణించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ప్రతిరోజూ గురిజేపల్లి గ్రానైట్ క్వారీల నుంచి బల్లికురవ వైపు గ్రానైట్ రాళ్ల అధిక లోడులతో ట్రాలీలు తిరుగుతుంటాయి. దీంతో రహదారి ఛిద్రమై అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆదర్శ హైస్కూలులో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. స్త్రీ పురుషుల సమానతల సాధనలో స్వాతంత్ర్యం–అనంతర పరిణామాలు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్, ఉపాధ్యాయులు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎలక్షన్ పోలింగ్ కేంద్రాలను మండల తహశీల్దారు విడుదల కిరణ్ అధికారులతో కలసి పరిశీలించారు. తహశీల్దారు కిరణ్ మాట్లాడుతూ త్రిపురాంతకం మండల వ్యాప్తంగా 985 గ్రాడ్యుయేట్ ఓట్లు, 75 టీచర్ ఓట్లు ఉన్నాయని, వీరందరికీ ఓటర్ స్లిప్పును పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ రోజున ఓట్లు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లు వారి యొక్క వ్యక్తిగత గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

లేఅవుట్లో సదుపాయాలు కల్పిస్తాం: కలెక్టర్

ప్రజాశక్తి-అద్దంకి: మండలంలోని గోపాలపురం జగనన్న కాలనీ లేఅవుట్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శనివారం అద్దంకి మండలం గోపాలపురం గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ లేఅవుట్ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోపాలపురం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన నీటిని ట్యాంకర్ల ద్వారా రేపటి నుంచి సరఫరా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. గోపాలపురం జగనన్న కాలనీ గహాలను ప్రారంభించని లబ్ధిదారులను డ్వాక్రా సంఘాల్లో చేర్పించి రుణాలను ఇవ్వాలని డిఆర్డిఎ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ విద్యాసాగర్, విద్యుత్ శాఖ డిఇఇ మస్తాన్ రావు, తహసీల్దార్ సుబ్బారెడ్డి, గృహ నిర్మాణ శాఖ డిఇఇ శర్మ తదితరులు పాల్గొన్నారు.

5జి నెట్ వర్క్ అండ్ కమ్యూనికేషన్స్పై గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో '5జి కమ్యూనికేషన్స్ అండ్ నెట్వర్క్స్" అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో బిటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు తెలియజేశారు. ఈ గెస్ట్ లెక్చర్కు బిఎస్ రావు, ప్రొఫెసర్, మహేంద్ర యూనివర్సిటీ ఇసిఇ విభాగం, హైదరాబాద్ నుంచి ముఖ్య అతిథిగా విచ్చేశారని ఇసిఎ విభాగాధిపతి కె జగదీశ్ బాబు తెలిపారు. బిఎస్ రావు మాట్లాడుతూ ఆధునిక కమ్యూనికేషన్ రంగంలో 5జి కమ్యూనికేషన్ ప్రముఖపాత్ర వహిస్తుందని తెలిపారు. ఈ గెస్ట్ లెక్చర్లో విద్యార్థులకు ఫ్రీక్వెన్సీ బాండ్స్, డిజిటల్ మాడ్యులేషన్ టెక్నిక్ల గూర్చి అవగాహన కల్పించి, 5జి నెట్ వర్క్స్ గూర్చి వివరంగా తెలిపారు. 5జి నెట్వర్క్ మిగతా 4జి, 3జి, 2జిల కంటే ఎందుకు భిన్నమైనదో విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. 5జి నెట్ వర్క్ ద్వారా హై స్పీడ్లో నిమిషానికి 800 ఎంబిపిఎస్లో డేటాను ట్రాన్స్ఫర్ చేయవచ్చునని అన్నారు. ఇసిఇ విభాగ అధ్యాపకులు, బిటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని చిమటావారిపాలెం, తనుబొద్దివారిపాలెం గ్రామాల్లో మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం రెండు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వి నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ శారీకంగా పురుషులు దృఢంగా ఉన్నప్పటికీ మహిళలు మానసికంగా, ఆలోచనాపరంగా దృఢంగా ఉంటారు అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు అని చెప్పారు. కార్యక్రమంలో యద్దనపూడి ఎస్ఐ రత్న కుమారి, ఎఎస్ఐ శేషసాయి, గ్రామ పెద్దలు వెంకటరావు, మహిళా పోలీసులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బాధిత విద్యార్థినులకు ఎస్ఎఫ్ఐ పరామర్శ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దోర్నాలలో ఏకలవ్య గురుకుల పాఠశాలలో గురువారం పలువురు విద్యార్థులు వాంతులు, విరేచనాలు, కళ్లు తిరిగి పడిపోవడం వంటి ఘటన గల కారణాలను తెలుసుకొనేందుకు ఆ పాఠశాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. అనంతరం దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు దర్శనం కార్తీక్ మాట్లాడుతూ హాస్టల్లో మంచినీటి సదుపాయం సరిగ్గా లేదన్నారు. వంట నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకనే ఇటువంటి ఘటన జరిగిందని అన్నారు. ఈ ఘటనపై కమిటీ వేసి వాస్తవాలను తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మార్కాపురం ఏరియా అధ్యక్షులు చరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్లో బాలల సంచారం

విచారించి తల్లిదండ్రులకు అప్పజెప్పిన బాపట్ల పోలీసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో ఒంటరిగా తిరుగుతున్న ఐదుగురు 12 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించిన పోలీసులు వారిని సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. శనివారం సూర్యలంక బీచ్ అవుట్ పోస్ట్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు సముద్రతీరంలో తిరుగుతూ ఉన్న ఐదుగురు ఒంటరి పిల్లలను గుర్తించారు. ఆ పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు గానీ, పెద్దలు గానీ ఎవరు లేకపోవడంతో అనుమానం వచ్చి ఆ పిల్లలను విచారించారు. గుంటూరు నల్లచెరువుకు చెందిన షేక్ హమీద్, షేక్ లాల్ జాన్ బాషా, తాటి తరుణ్, షేక్ ఇమామ్, తాటి భూషణం అను వారు ఇంటిలో ఎవరికీ చెప్పకుండా సూర్యలంక బీచ్కు వచ్చినట్లు తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులను బాపట్ల పిలిపించి రూరల్ ఎస్ఐ వెంకట ప్రసాద్ వారికి కౌన్సెలింగ్ చేసి ఐదుగురు పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. వారు ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరెవరితో తిరుగుతున్నారు వంటి వాటిని గమనించుకుంటూ ఉండాలన్నారు. వారు చెడు అలవాట్లు నేర్చుకున్న తరువాత వారిని మందలించే కంటే, ముందు నుంచి వారు చెడు అలవాట్లకు లోనుకాకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంటుందని అన్నారు.

జనని సురక్ష యోజన పథకం వినియోగించుకోండి

ప్రజాశక్తి-పంగులూరు



వైఎస్సార్ బేబీ కిట్ను అందజేస్తున్న డాక్టర్ మల్లికార్జునరావు

ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం అయిన వారికి జననీ సురక్ష యోజన పథకం వర్తిస్తుందని, ఈ పథకం కింద బాలింత సంరక్షణకు రూ.ఐదు వేలు ఇస్తారని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. శనివారం పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, 13వ సాధారణ ప్రసవాన్ని చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు తల్లీ బిడ్డ పౌష్టికాహారం కోసం రూ.5,000 అందజేశారు. వైఎస్సార్ బేబీ కిట్టు కూడా బాలింతకు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున్రావు మాట్లాడుతూ బాలింతకు, వారికి సహాయంగా వచ్చిన వారికి టిఫిన్, భోజనం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పుట్టిన బిడ్డకు టీకాలు, జనన ధ్రువీకరణ పత్రం ఇస్తున్నట్లు తెలిపారు. కావలసిన మందులు కూడా ఏర్పాటు చేస్తున్నామని, రెండు రోజుల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశీలన నిమిత్తం ఉంచుతున్నామని చెప్పారు. మండల ప్రజలు గవర్నమెంట్ హాస్పిటల్లో జరిగే ఉచిత సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ చెన్నయ్య, స్టాఫ్ నర్స్ క్రాంతి, సంధ్యారాణి, శివ, మార్త, సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రెండో విడత సాయం అందజేత

ప్రజాశక్తి-త్రిపురాంతకం: త్రిపురాంతకం మండల కేంద్రంలో చింతపల్లి లోకేష్ రెండు కిడ్నీలు పాడైపోయి డయాలసిస్పై ఆధారపడి బతుకు బండిని వెళ్లదీస్తున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాచగోర్ల వెంకట సుశీల పిచ్చయ్య ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునే నిమిత్తం ముందుకు వచ్చి గత రెండు నెలల నుంచి రూ.12 వేల చొప్పున సాయం అందిస్తున్నారు. ఈ నెల కూడా లోకేష్ కుటుంబానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్న జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాచగోర్ల వెంకట సుశీల పిచ్చయ్యకు లోకేష్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రదానం వల్ల మరొకరికి కంటిచూపు

ప్రజాశక్తి-అద్దంకి

నేత్రదానం వలన మరొకరికి కంటి చూపు లభిస్తుందని, నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన రామకోటేశ్వరరావు(60) శనివారం ఉదయం మృతి చెందారు. రాచుమల్లు శివ, చుండూరి మురళీ సుధాకరరావుల ప్రోత్సాహంతో, రామకోటేశ్వరరావు భార్య విజయలక్ష్మి కుమార్తె సుష్మ, సోదరులు రామదాసు, రామకృష్ణల అనుమతితో శంకర్ నేత్రాలయం, గుంటూరు నుంచి డాక్టర్ వెంకటేశ్వర్లు నాగులపాడు గ్రామానికి వచ్చి రామకోటేశ్వరరావు నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చిన్ని మురళీకృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, మంగమూరి సురేషు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థినులకు పరామర్శ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దదోర్నాల ఏకలవ్య మోడల్ స్కూల్లో అస్వస్థతకు గురయిన విద్యార్థినులను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తనయుడు, జార్జి విద్యాసంస్థల చైర్మన్ ఆదిమూలపు విశాల్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, వైసిపి మండల ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, నాయకులు గంటా వెంకట రమణారెడ్డి, అమ్మిరెడ్డి రామిరెడ్డి, గుమ్మా యల్లేష్, బొగ్గరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్నేహ హస్తం' చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి పట్టణంలోని సాయి సిద్ధార్థ హాస్పటల్ సమీపంలో స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధీర్బాబు దివంగత మోహన్రావు జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు ప్రారంభించారు. మంచినీటితోపాటు మజ్జిగను ప్రజలకు పంపిణీ చేశారు. స్నేహహస్తం చారిటిబుల్ ట్రస్ట్ ద్వారా సుధీర్బాబు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ సభ్యులు కిషోర్బాబు, కాశింపీరా, వెంకటేశ్వర్లు, విల్సన్, డేవిడ్, స్వర్ణబాబు, డి మల్లికార్జునరావు, జి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవు

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి పట్టణంలోని 13వ వార్డులో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రిజ్వానా, శానిటరీ ఇన్స్పెక్టర్ చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది జ్యోతి, వైసీసీ నాయకులు ఖాలక్, నాయబ్రసూల్, మస్తాన్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్, జెవివి, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయటంలో విఫలమయ్యారని విమర్శించారు. డిగ్రీ, జూనియర్ కాలేజ్, సోషల్, ట్రైబల్, ఏపి రెషిడెన్సియల్ లాంటి స్కూల్స్‌లో రెగ్యులర్ పోస్టులు ఉన్నా భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించుకొని శ్రమదోపిడీకి గురిచేస్తున్నారన్నారు. యుటిఎఫ్ నాయకునిగా ఎందరో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలపై అవగాహన కలిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన తనను, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన పి.బాబురెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు వి.మాలకొండారెడ్డి, యుటిఎఫ్ నాయకులు ఎస్ అచ్చిరెడ్డి, వి బ్రహ్మారెడ్డి, బత్తుల రుష్యేంద్రకుమార్, సిఐటియు నాయకులు పిసి కేశవరావు, పి నరేంద్ర పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించే అభ్యర్థులనే ఎన్నుకోండి

జెవివి రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్



నమూనా పేపర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు... ప్రజలందరి సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించేది, ప్రజల తరపున పోట్లాడ గలిగేది పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మాత్రమేనని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికల ప్రచార కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రకాశం–నెల్లూరు– చిత్తూరు జిల్లాల ఉపా ధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గ నమూనా బ్యాలెట్ పేపర్లను ఆవిష్కరించారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఏవి పుల్లారావు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాశ్, డివైఎఫ్ఐ కార్యదర్శి కెఎఫ్.బాబు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకుడు సిహెచ్. రాంబాబు పాల్గొన్నారు.

నేడు 'పది' విద్యార్థులకు

టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వెలిగండ్ల

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తెలుగు మీడియం మరియు ఇంగ్లీష్ మీడియం చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు శ్రీశ్యామల వెంకట్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11వ టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పౌండేషన్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి శనివారం తెలిపారు. ఈ టాలెంటెడ్ పరీక్షలు కనిగిరి కేటీఆర్ టెక్నో స్కూల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడునని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మొదటి ఐదు బహుమతులు ఉంటాయని, మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండవ బహుమతిగా రూ.12వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు, 3వ బహుమతిగా రూ.7వేలు, 5వ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు ముక్కు కాశిరెడ్డి, కలిగిరి మాజీ శాసన సభ్యులు మరియు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్షకు హాజరవు విద్యార్థులు ఉదయం 8:30లకు పాఠశాల దగ్గర ఉండాలని ఆయన కోరారు.

మేధావులకు పరీక్షా కాలం.!



మేధావులకు పరీక్షా కాలం వచ్చింది. తమ మేధస్సుతో సమాజానికి దిశానిర్దేశం చేసే సమయం రానే వస్తోంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడే కీలకమైన ఘట్టం ఎమ్మెల్సీ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న వారంతా మేధావులైన అధ్యాపకులు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లు, యువత. వీరి ఓటు ఇప్పుడు అమూల్యమైంది. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఎవరిని ఎన్నుకోవాలనే దానిపై ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలే ప్రజాస్వామ్యానికి గీటురాయిగా మారనున్నాయి. ఇప్పటివరకూ పిడిఎఫ్ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకే పట్టం కడుతున్నారు. ప్రజాగొంతుకగా భావించి మేధావులు అందరూ యుటిఎఫ్ నుంచి పోటీ చేసే అధ్యాపకులను ఎమ్మెల్సీలుగా గెలిపించారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగానే అనేక సమస్యలపై గత 16 ఏళ్లుగా మండలిలో వాణిని వినిపిస్తున్నారు. బయట జరిగే ప్రజాపోరాటాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వంపై రాజీ లేని ధోరణితోనే పనిచేస్తున్నారు. ఎవరైతే తమ సమస్యలపై గళం విప్పుతారని ఓటేశారో వారి మనోభావాలకు తగిన విధంగానే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పనిచేస్తున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని అనేక సమస్యలపైనా.. రాష్ట్రస్థాయి అంశాలపైనా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రమణ్యం, యండపల్లి శ్రీనివాసులరెడ్డి తమ వాణి ఏవిధంగా వినిపించారో చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజల పక్షానే నిలబడ్డారు. వారి కోసమే పనిచేశారు. అమరావతి వంటి అనేక కీలక అంశాల్లో మండలిలో సాగిన ఉత్కంఠ చర్చల్లో కీలకపాత్ర పోషించారు. గత ప్రభుత్వంలోనూ..ఇప్పటి ప్రభుత్వంలోనూ చేసిన అనేక నిర్ణయాలపై నిర్మాణాత్మక పాత్ర పోషించారు. తమ వైఖరిని స్పష్టంగా చెప్పగలిగారు. ప్రజాగొంతుక వీరిదేనన్న భావన ఓటేసిన మేధావుల్లో ఉంది. పిఆర్‌సి ఉద్యమంలో ఎలాంటి పాత్ర పోషించారో ఉద్యోగులు ఇప్పటికీ మరువలేని అంశం. పాలకపక్షాలు ఈసారి అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఇప్పుడు పాలకపక్షాలపైనే ఉద్యోగ వర్గాలు, అనేక వర్గాలు తమ సమస్యలపై పోరాటాలు చేస్తున్నారు. ఎందుకంటే స్పందన లేనందునే.. ఇప్పుడు ఆ పార్టీల నుంచే అభ్యర్థులు తమను గెలిపించాలని పోటీలో ఉన్నారు. అనేక సమస్యలపై ఇప్పుడు సాగుతున్న పోరాటాలపై వీరేమీ సమాధానం చెప్పలేని పరిస్థితి. ఉద్యోగులతో పాటు అనేక వర్గాలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. నిత్యం ఉద్యోగ సంఘాలు ఆందోళనలకు పిలుపునిస్తూనే ఉన్నాయి. సిపిఎస్ రద్దు, పిఆర్‌సీ అమలుపై ప్రభుత్వం నుంచి ఇప్పటికీ సరైన సమాధానం లేదు. జిల్లా వెనుకబాటుతనం, పెండింగు ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి, వలసలు, సాగునీటి సమస్య, పేదరికం, గిరిజన సమస్యలు, దళితుల సమస్యలు ఇలా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో పిడిఎఫ్ ముందుకు పోతోంది. ఈ వేదికపై పోటీ చేస్తున్న అభ్యర్థులకు మంచి ఆదరణ కూడా ఉంది. రానున్న ఎన్నికల్లో మేధావులు ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.